సాక్షి కామారెడ్డి

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదయ్యే ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



బంద్ ప్రశాంతం

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జిల్లాలోని పలు ప్రాంతాలలో సోమవారం బంద్ నిర్వహించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /22.6

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

అరకొర వానలే!

- కరుణించని వరుణుడు
- వెలవెలబోతున్న జలాశయాలు
- పెరగని భూగర్భ జలమట్టం
- ఆందోళన చెందుతున్న రైతులు

వర్షాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా జిల్లాలో సరైన వర్షాల జాడ కరువైంది. భారీ వర్షాలు కురవకపోవడంతో జలాశయాలు ఇప్పటికీ బోసిపోతున్నాయి. వాగులు, వంకలు పారకపోవడంతో భూగర్భ జలాలూ పెరగలేదు. దీంతో సాగు చేసిన పంటలు గట్టెక్కుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: వరుణుడు రైతులతో దోబూచులాడుతున్నాడు. రోజూ కమ్ముకొస్తున్న మేఘాలు కరుణను వర్షించకుండానే వెళ్లిపోతున్నాయి. జల్లులు, ఓ మోస్తరు వర్షం తప్ప పెద్దగా వానలు లేవు. రోజూ రైతులు ఆకాశం వైపు ఆశగా చూడడం, వర్షం రాకపోవడంతో నిరాశచెందడం పరిపాటైంది. జిల్లాలో ముఖ్యంగా మెట్ట ప్రాంతమైన కామారెడ్డి, ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్ల పరిధిలో అరకొర వర్షాలే కురియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 70 శాతమే పంటలు సాగయ్యాయి. సాగు నీరు లేకపోవడంతో చాలాచోట్ల నాట్లు కూడా పడలేదు. దీంతో అంతంతమాత్రంగానే వరి సాగైనట్లు తెలుస్తోంది. వర్షాల మీద నమ్మకం కుదరకపోవడంతో చాలా మంది రైతులు నాట్లు వేయడానికి ఆలోచిస్తున్నారు. ఒకవేళ భారీ వర్షాలు కురిస్తే అప్పుడు నాటేద్దామనే ధోరణతో ఉన్నారు. ఒకవేళ వర్షాలు కురవకుంటే, బోర్లు నీరు పోయకుంటే ఏం చేయాలన్న దానిపై రైతులు ఆలోచనలు చేస్తున్నారు. మొన్నటి దాకా ఊరించిన వరుణుడు ముఖం చాటేయడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. దీనికి తోడు రెండు మూడు రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో రైతులు నాట్లు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు.



ఈ సీజన్‌లో నమోదైన వర్షపాతం వివరాలు(మి.మీ.లలో)..

మాసం	సాధారణం	నమోదైన వర్షపాతం	లోటు/అధిక వర్షపాతం
జూన్	144.8	128.9	-10.9%
జూలై	250.9	305.2	+21.6%
ఆగస్టు (ఇప్పటివరకు)	103.3	48.5	-53.0%

సగానికిపైగా మండలాల్లో లోటే..

జిల్లాలో సగానికి పైగా మండలాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు బీబీపేట మండలంలో సాధారణం కన్నా 37.1 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దోమకొండలో 32.2 శాతం, ఎల్లారెడ్డిలో 29.5, పాల్వంచలో 29, నిజాంసాగర్‌లో 25.6, మాచారెడ్డి మండలంలో 19.1, కామారెడ్డిలో 18.7, పిట్లంలో 15.2, నిజాంసాగర్‌లో 13.1 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది.

వాగులు ఉప్పొంగలే..

జిల్లాలోని దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, పాల్వంచ, భిక్కనూరు, రామారెడ్డి, కామారెడ్డి, తాడ్వాయి, సదాశివనగర్, లింగంపేట, తదితర మండలాల్లో భారీ వర్షాలు కురవకపోవడంతో వాగులు పొంగి ప్రవహించలేదు. ఇప్పటి దాకా కురిసిన వర్షాలతో వాగుల్లోని గుంతలు నిండాయే తప్ప పెద్దగా పారింది లేదు. పాల్వంచ వాగు, లొట్టి వాగు, కూడవెళ్లి వాగు, భీమేశ్వర వాగు.. ఇలా చాలా వాగులు కొద్దిమేర మాత్రమే జలకళ సంతరించుకున్నాయి. వాగులు పారితేనే భూగర్భజలమట్టం పెరుగుతుంది.

ఆగస్టులో మరీ దారుణం..

ఈ వర్షాకాలం సీజన్‌లో వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. జూన్, జూలై మాసాల్లో కాలం అనుకూలించకపోవడంతో.. కనీసం ఆగస్టు అయినా కలిసి వస్తుందని ఆశించారు. అయితే వారి ఆశలను వరుణుడు అడియాసలు చేశారు. ఆగస్టులో జిల్లాలో ఇప్పటి వరకు 103.3 మి.మీ. సరాసరి వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 48.5 మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. అంటే సాధారణంకన్నా 53 శాతం లోటు వర్షపాతం నమోదయ్యింది. ఖరీఫ్ పంటలకు కీలకమైన ఆగస్టు మాసంలో కాలం అనుకూలించకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నెలలో మంచి వర్షాలు కురిస్తే మక్క, పత్తి, సోయా వంటి పంటలు మంచి దిగుబడినిస్తాయి. అయితే ఈ మాసంలో ఇప్పటి దాకా పెద్ద వర్షం కురవలేదు. సరైన వర్షాలు లేకపోవడంతో బోరుబావుల మీద ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతులూ ఆందోళన చెందుతున్నారు. ఆగస్టులోనైనా పెద్దవానలు పడితే నాట్లు వేద్దామని చూస్తున్న అన్నదాతలు నిరాశ చెందుతున్నారు.

న్యూస్‌రీల్

లింగంపేటను పర్యాటక కేంద్రంగా మారుస్తాం



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామని రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ ఫౌండర్ కల్పన రమేశ్ పేర్కొన్నారు. సోమవారం ఆమె మండల కేంద్రంలోని పలు చారిత్రక కట్టడాలను సందర్శించారు. మండల కేంద్రంలోని నగరేశ్వర ఆలయం, ఆలయం ముందు గాలికి ఊగే ధ్వజస్తంభం, జగన్నాథ ఆలయం, శెట్పల్లి శివారులోని శివాలయం, అయ్యపల్లి గ్రామ శివారులోని ప్రభుస్వామి ఆలయాలను పరిశీలించారు. ఆయా గ్రామాలలో స్థానికులతో మాట్లాడి చారిత్రక కట్టడాల విశేషాలను తెలుసుకున్నారు. లింగంపేటలోని నాగన్నగారి మెట్లబావిని పర్యాటక కేంద్రంగా మార్చామని ఆమె పేర్కొన్నారు. త్వరలో ఇతర చారిత్రక కట్టడాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో నరేశ్, గ్రామస్తులు ఉన్నారు.

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా నిత్యానందం



కామారెడ్డి అర్బన్: విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా ఆధారపు నిత్యానందం నియమితులయ్యారు. ఇప్పటి వరకు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా గోపాలకృష్ణను విభాగ్ సంపర్క ప్రముఖ్‌గా నియమించారు. జిల్లా కోశాధికారిగా అమ్ముల శ్రీనివాస్, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్‌గా వివేకానంద అశోక్, బజరంగ్‌దళ్ గోరక్షక్‌గా తులసీదాస్ నియమితులయ్యారు.

విధులక్కడ.. వేతనమిక్కడ

- డిప్యుటేషన్‌పై వెళ్లిన సదాశివనగర్ పశువైద్యాధికారి
- పశువులకు అందని వైద్య సేవలు



సదాశివనగర్: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఐదేళ్లుగా పూర్తి స్థాయి వైద్యులు లేకపోవడంతో పశువులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. కార్యాలయంలోని అటెండరే అన్ని సేవలు అందించాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడికి వచ్చిన అధికారులు వచ్చినట్లే డిప్యుటేషన్‌పై వెళ్లిపోతున్నారు. ఇటీవల మండల పశువైద్యాధికారిగా వచ్చిన వ్యక్తి.. 317 జీవోను ఆసరాగా చేసుకుని డిప్యుటేషన్‌పై తిరిగి నల్గొండ జిల్లాకు వెళ్లిపోయారు. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. సదరు అధికారి నల్గొండ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నా.. సదాశివనగర్ పశువైద్యాధికారిగానే వేతనం పొందుతుండడం గమనార్హం. పశువైద్యశాలలో పశువైద్యాధికారి అందుబాటులో ఉండేలా చూడాలని పశుపోషకులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీలోకి పెరిగిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. సోమవారం 5,100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కాకతీయ కాలువ ద్వారా 2,750 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300, లక్ష్మికాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 502 క్యూసెక్కులు పోతుండగా, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,091(80 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1,080.8(47.25 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో జల విద్యుదుత్పత్తి కేంద్రంలో ఒక టర్బయిన్ ద్వారా 4.5 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు.

ఉత్తమ లైబ్రేరియన్‌గా తారకం

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న తారకం రాష్ట్రస్థాయి ఉత్తమ లైబ్రేరియన్‌గా ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు.

అవకతవకలను సహించేది లేదు

- రేషన్ డీలర్ల నియామకంలో పారదర్శకంగా వ్యవహరించాలి
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: నియోజకవర్గంలో రేషన్ దుకాణాల డీలర్‌షిప్ కేటాయింపులో ఎలాంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత, మౌఖిక పరీక్షలలో అర్హత సాధించిన వారికి మాత్రమే రేషన్ దుకాణాలను కేటాయించాలని సూచించారు. అవినీతి రహిత కామారెడ్డి కోసం బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఇందుకోసం ఎమ్మెల్యే సీటు గెలిస్తే సరిపోదని రాబోయే ఎన్నికల్లో పంచాయతీలు, బల్దియాలోని అన్ని స్థానాలలో బీజేపీ గెలిస్తేనే లక్ష్యాన్ని చేరుకోగలమని పేర్కొన్నారు. కామారెడ్డి బల్దియాపై కాషాయ జెండా ఎగురవేస్తామన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు విపుల్, బల్దియాలో పార్టీ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, నాయకులు నరేందర్, అనిత, వేణు, వెంకటాచారి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకే 'హర్ ఘర్ తిరంగా'

కామారెడ్డి టౌన్: దేశభక్తిని పెంపొందించడానికి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని బీజేపీ కార్యాలయం వద్ద ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలందరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాలను ఆవిష్కరించాలన్నారు. బీజేపీ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగింది.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు

కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు వేణు, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'బాల్‌రాజ్‌గౌడ్ సేవలు చిరస్మరణీయం'

కామారెడ్డి అర్బన్: మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థి చింతల బాల్‌రాజ్‌గౌడ్ సమాజానికి చేసిన సేవలను మరచిపోలేమని వక్తలు పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం ఆయన జయంతిని నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కళాశాల ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి బాల్‌రాజ్‌గౌడ్ రూ. 50 లక్షల విరాళం అందించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, ఎన్‌సీసీ అధికారి ఏ.సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు చంద్రశేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, బాల్‌రాజ్‌గౌడ్ భార్య చింతల మంగ, కుమారుడు నితిన్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, నిజామాబాద్ చైర్మన్ ఆంజనేయులు పాల్గొన్నారు.



బాల్‌రాజ్‌గౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న లెక్చరర్లు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: స్వాతంత్య్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకల సందర్భంగా జిల్లా అధికారులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు కూర్చోవడానికి ఫర్నిచర్ సమకూర్చాలన్నారు. పరేడ్ గ్రౌండ్‌ను ముస్తాబు చేయాలన్నారు. పోలీస్, అగ్నిమాపక, అటవీ, జిల్లా వైద్యారోగ్య, వ్యవసాయ, రోడ్డు రవాణా శాఖల ఆధ్వర్యంలో శకటాలు ప్రదర్శించాలన్నారు.

ఉద్యానవన, మిషన్ భగీరథ, మున్సిపల్, గ్రామపంచాయతీ, వ్యవసాయం, విద్య, అటవీశాఖ, ఐసీడీఎస్, ఉపాధి హామీ, ఐకేపీ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో సీపీవో రాజారాం, డీఆర్‌డీవో సురేందర్, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాసరావు, డీఏవో భాగ్యలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మించేదెప్పుడో?

- టెండర్ పూర్తయినా ప్రారంభం కాని పనులు
- త్వరగా నిర్మించాలంటున్న ప్రజలు



సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 2.11 కోట్లు మంజూరు చేసింది. అయితే విద్యుత్ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం సబ్‌స్టేషన్ మంజూరు చేసినా.. నిర్మాణ పనులపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో సమస్య అపరిష్కృతంగానే ఉంది.

ప్రస్తుతం హసన్‌పల్లి శివారులోని 33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మహమ్మద్‌నగర్ ఫీడర్‌కు కరెంట్ సరఫరా చేస్తున్నారు. ఆ సబ్ స్టేషన్ నుంచి బొగ్గగుడిసె, నర్వ, మహమ్మద్‌నగర్, గున్కుల్, బూర్గుల్ గ్రామాలకు కరెంట్ సరఫరా అవుతుండగా, లో ఓల్టేజీతోపాటు అటవీప్రాంతం నుంచి సరఫరా ఉండటంతో తరచూ బ్రేక్ డౌన్ సమస్యలు ఎదురవుతున్నాయి. వానాకాలం, చలికాలంలో సమస్య మరింత తీవ్రంగా ఉంది. విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రభుత్వం మహమ్మద్‌నగర్‌కు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేస్తూ రూ.2.11 కోట్లు విడుదల చేసింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిధులు మంజూరు కాగా ఎలక్షన్ కోడ్ కారణంగా టెండర్ల ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొంత కాలానికి పార్లమెంట్ ఎన్నికలు రావడంతో సబ్ స్టేషన్ టెండర్ ప్రక్రియలో జాప్యమైంది. చివరకు జూన్‌లో టెండర్ ప్రక్రియను పూర్తయ్యింది. అయితే పనులు మాత్రం ప్రారంభం కాలేదు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి గతంలోనే స్థలం కేటాయించినప్పటికీ సంబంధిత అధికారులు ముహూర్తం పేరుతో కాలయాపన చేస్తున్నారన్న విమర్శలున్నాయి. అధికారులు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చేతుల మీదుగా నిర్మాణ పనులకు భూమిపూజ చేయించాలనే ఆలోచనలో ఉన్నారు. విద్యుత్ అధికారులు, రాజకీయ నాయకులు నాన్చుడు ధోరణిని వీడాలని, విద్యుత్ సమస్య పరిష్కారంకోసం సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

పంద్రాగస్టున 'పోచారం' నీటి విడుదల

- ఖరీఫ్‌లో తొలిసారి విడతలవారీగా నీరు..
- ప్రాజెక్టులో ఆశించినంత నీరు లేకపోవడమే కారణం
- తైబందీ సమావేశంలో నిర్ణయం



తైబందీ సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు ఆయకట్టు కింద పంటల సాగు కోసం ఈనెల 15వ తేదీనుంచి నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు ఎల్లారెడ్డి ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయకట్టు పరిధిలోని రైతులతో తైబందీ సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టులో ప్రస్తుత నిల్వల ఆధారంగా నాలుగు విడతలుగా నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ 15 రోజులపాటు నీటిని విడుదల చేసి ఆ తర్వాత పది రోజులు నిలిపివేస్తామన్నారు. ఇలా నాలుగు విడతలలో నీటిని అందిస్తామన్నారు. ప్రాజెక్టులో ఆశించినంత నీరు నిల్వ లేకపోవడంతో గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో విడతలవారీగా నీటిని విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. ప్రాజెక్టులో తక్కువ నీరు వచ్చి చేరినందున రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రధాన కాలువలో ఎవరూ మోటార్లను పెట్టవద్దన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సిద్దయ్య, మాజీ ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటివిడుదల షెడ్యూల్...

- **తొలి విడత** : ఈనెల 15 నుంచి 29 వ తేదీ వరకు
- **రెండో విడత** : సెప్టెంబర్ 9 నుంచి 23వ తేదీ వరకు
- **మూడో విడత** : అక్టోబర్ 4 నుంచి 18వ తేదీ వరకు
- **నాలుగో విడత** : అక్టోబర్ 29 నుంచి నవంబర్ 12 వరకు..

'విద్యతోనే అభివృద్ధి'

బాన్సువాడ: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులలో పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులు, రూ.9 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నానన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు త్వరలోనే వస్తాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాల్‌రాజ్

ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూ,ఇంచారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి జనం భారీగా తరలివచ్చారు. మొత్తం 170 దరఖాస్తులు నమోదయ్యాయి. వాటిలో 86 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా మిగితావి ఆయా శాఖలకు చెందినవి నమోదయ్యాయి. వచ్చిన వినతులను స్వయంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్వీకరించి పరిశీలన జరిపారు. ఆపై సంబంధిత శాఖల అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించడంపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. శాఖల వారీగా ఉన్న పెండింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల్లో పెండింగ్ క్లియర్ చేయాలని ఆదేశించారు. డీఆర్డీఓ సురేందర్, జడ్పీ సీఈవో చందర్ నాయక్, సీపీఓ రాజారాం, డీపీఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


బారులు తీరిన ఫిర్యాదుదారులు

శిఖం భూమిని కబ్జా చేస్తున్నారు


ఫిర్యాదు ప్రతిని చూపుతున్న జాన్కంపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు

గ్రామానికి చెందిన ప్రధాన చెరువు శిఖం భూమిని చుట్టూ ఉన్న రైతులు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని నాగిరెడ్డిపేట మండలం జప్తి జాన్కంపల్లి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రతిఏటా మట్టి వేయిస్తూ క్రమంగా చెరువు భూమిని ఆక్రమిస్తున్నారన్నారు. ఇప్పటికే చాలా భూమి ఆక్రమణకు గురైందన్నారు. దీంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. కబ్జీ చేసి సాగు చేస్తున్న పంటలకు ఇష్టారీతిన పురుగుమందులు వాడటంతో చెరువులోని చేపలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తగిన చర్యలు తీసుకుని ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్‌కు విన్నవించారు.

క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన త్రిలింగేశ్వరాలయం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : శ్రావణమాస సోమవారంను పురస్కరించుకొని నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ శివారులో గల శ్రీ త్రిలింగేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. నిజామాబాద్, మెదక జిల్లాతోపాటు కామారెడ్డి జిల్లాలోని పలుగ్రామాల నుండి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ఆలయంలోని స్వామివారిక ప్రత్యేకపూజలు చేశారు. దీంతోపాటు భక్తిశ్రద్ధలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బుడగ జగం కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్ : జిల్లా బుడగ జంగం సంఘం ఆధ్వర్యంలో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా విభూది సాయిలు, ప్రధాన కార్యదర్శిగా సిరిగిరి తిరుపతి, ఉపాధ్యక్షులుగా తూర్పాటి అంజయ్య, మాదినం సీతారామయ్య, కొండపల్లి సాయిలు, ఆంద్రాసి వెంకట్, కోశాధికారిగా ఒంటెద్దు సంగమేష్, ప్రచార కార్యదర్శిగా రాచూరి దుర్గాప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పొన్నకంటి నారాయణ, జాయింట్ కార్యదర్శిగా విభూది చిన్న సాయిలు ఉన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య పనులు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని వీధుల్లో సోమవారం రోడ్లు, మురికి కాల్వలు, మురికి నీటి గుంతల్లో దోమల మందు పిచికారి చేశారు. మురికి కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ వేయించారు.కార్యక్రమంలో కార్యదర్శి శ్రావణ్‌కుమార్,గ్రామ పంచాయితీలసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ పోగొట్టేందుకు కృషి



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ పోగొట్టేందుకు నస్రుల్లాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థి సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గూడ్ల సాయిలు విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులు అందజేశారు. ఆగస్టు 15న విద్యార్థులు పాటలు, ఉపన్యాస పోటీలను నిర్వహించి వారికి ప్రోత్సహించాలన్నారు. దీనిలో భాగంగా హెచ్‌ఎం చందర్‌కు బహుమతులను అందించారు. మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు హన్మాండ్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.


బాన్సువాడలో మూసి ఉన్న దుకాణాలు


బిచ్కుందలో రోడ్డుపై బైఠాయించిన యువకులు

బంద్ ప్రశాంతం

బాన్సువాడ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులకు వ్యతిరేఖంగా హిందు సంఘాలు ఇచ్చిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా దుకాణ సముదాయాలు స్వచ్ఛందంగా బంద్‌ను ప్రకటించాయి. పలుచోట్ల హిందు సంఘాల సభ్యులు బందు పాటించాలంటూ ర్యాలీ చేశారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్) : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, మరణ హోమానికి నిరసనగా సోమవారం బిచ్కుందలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో మార్కెట్ బంద్‌కు పిలుపునిచ్చి వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు బంద్ చేయించారు. బంద్ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపి బంగ్లా హిందువులకు సంఘీభావం తెలిపారు. విదేశాల్లో హిందువులకు రక్షణ లేకుండా పోతోందన్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సోమవారం నస్రుల్లాబాద్ మండల బంద్‌కు హిందూ సంఘాల పిలుపునిచ్చాయి. దీంతో వ్యాపార సముదాయాలు స్వచ్ఛంద బంద్ పాటించాయి. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి హన్మాండ్లు యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క హిందువు ఈ హత్యాకాండకు నిరసన తెలుపాలన్నారు. మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు సున్నం సాయిలు, ఓబీసీ జిల్లా కన్వీనర్ వడ్ల సతీష్, నాయకులు కంది మల్లేష్, యాదగిరి గౌడ్ తదితరులున్నారు.


నస్రుల్లాబాద్‌లో బంద్‌లో పాల్గొన్న హిందూ సంఘం సభ్యులు

నేడు ఎల్లారెడ్డి బంద్

ఎల్లారెడ్డి : నేడు ఎల్లారెడ్డి బంద్‌కు పిలుపునిచ్చినట్లు హిందూ సంఘాల ఐక్య వేదిక నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఎల్లారెడ్డి బంద్‌కు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. బంద్‌లో వ్యాపారవర్గాల వారు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించి విజయవంతం చేయాలని వారు కోరారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీవీఎం నాయకులు, విద్యార్థులు

కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ విద్యార్థి మోర్చా(బీవీఎం) ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ మేరకు విద్యార్థులో కలిసి ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విశల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన రూ. 8వేల కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కంచకుంటే రాష్ట్రవ్యాప్తంగా అందోళనలు చేస్తామని ఎమ్మెల్యేలు, మంత్రులను అడ్డుకుంటామన్నారు. కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీవీఎం జిల్లా ఇన్‌చార్జి బుల్లెట్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు శివ, నాయకులు గడ్డం రవి, అజయ్, శివరాం, శ్రవణ్, అజయ్, అభిలాష్, సాయి చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు సన్మానం



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన కృష్ణయ్యను కామారెడ్డి రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ అండ్ డెవలపర్స్ అసోసియేషన్ (క్రెడా) ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సన్మానించారు. రిజిస్ట్రేషన్లు ఇతర పనులపై కార్యాలయానికి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రెడా అధ్యక్షుడు పిట్ల రాములు, దేవసేన పటేల్, కోటేశ్వర్, పంతులు శ్రీనివాస్ తదితరులున్నారు.

లింగాపూర్‌లో పశువైద్య శిబిరం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో డాక్టర్ రవికిరణ్ ఆధ్వర్యంలో పశువులకు(ఎల్ఎస్‌డీ) ముద్ద చర్మ వ్యాధి టీకాలు 80 గోజాతి పశువులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల డెయిరీ అధ్యక్షుడు రాజు, పాడి రైతులు, పశు వైద్య సిబ్బంది తదితరులున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



కామారెడ్డి క్రైం: మద్యం సేవించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపకూడదని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వారం రోజులుగా నిర్వహిస్తున్న డ్రంకెన్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన మందుబాబులకు సోమవారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. బైక్‌లపై వెళ్లే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాల చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎక్కువ శబ్దాన్ని ఇచ్చే సైలెన్సర్‌లను పెట్టుకోవడం, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాల నడపడం చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పీహెచ్‌సీలో వైద్యసిబ్బందిని నియమిస్తాం


పెద్దకొడప్‌గల్ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : పెద్దకొడప్‌గల్ పీహెచ్‌సీలో సిబ్బందిని నియమిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత కారణంగా రోగులు అవస్థలు పడుతున్నారని 'సాక్షి'లో 'సిబ్బంది కొరత..రోగుల అవస్థ' శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన జిల్లా వైద్యా అధికారులు పెద్దకొడప్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగుల ఇబ్బందులను తెలుసుకోన్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఒక మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్స్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. రెండురోజుల్లో తాగు నీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ రోహిత్ కుమార్ గౌడ్, నూతన మెడికల్ ఆఫీసర్ ఉమాకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

విధుల నుంచి తొలగింపు

మాచారెడ్డి : 'మధ్యాహ్న భోజనం తినలేం' శీర్షికన ఈనెల 7న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన డీఈవో రాజు మండలంలోని ఘన్‌పూర్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మంజురాణిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. వరుసగా ఆహార నియంత్రణ జిల్లా అధికారిణి సునీత, ఎంఈవో ఎల్లయ్య విచారణ జరిపి ఆహారంలో పురుగులు వస్తున్నాయని వచ్చిన వార్తా కథనం వాస్తవమని నివేదికను డీఈవోకు పంపించారు. ఈ మేరకు సోమవారం డీఈవో ఇన్‌చార్జి హెచ్‌ఎం మంజురాణిని విధులనుంచి తొలగిస్తూ శారద అనే టీచర్‌కు ఇన్‌చార్జి ఇస్తున్నట్లు తెలిసింది.

రామక్కపల్లి బడిలో మరమ్మతులు ప్రారంభం


రామక్కపల్లిలో పాఠశాల భవనం పైకప్పును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని బడికి ఎట్టకేలకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఈనెల 03న 'సాక్షి'లో 'అధ్వాన్నంగా రామక్కపల్లి బడి'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా మంజూరైన నిధులు పాఠశాల భవన మరమ్మతులకు సరిపోకపోవడంతో సంబంధిత అధికారులు రూ.4.30లక్షల నిధులతో రెండోసారి ప్రతిపాదనలు పంపారు. రెండోసారి పంపిన ప్రతిపాదనలకు సంబంధించి ఎలాంటి స్పందన లేకపోవడంతోపాటు పాఠశాల తరగతులు గ్రామంలోని కమ్యూనిటీ భవనంలో కొనసాగుతున్న విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీంతో జిల్లాకలెక్టర్ స్పందించి పాఠశాల భవన మరమ్మత్తులకు నిధుల విడుదలకు అనుమతించినట్లు తెలిసింది. ఈ మేరకు సోమవారం పాఠశాల భవనం పైకప్పును కూల్చేశారు. భవనం పైకప్పును తొలగించి రేకులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో చేపట్టిన పాఠశాల భవనం పైకప్పు కూల్చివేత పనులను ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలంచారు. ఆయనవెంట ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్, హెచ్‌ఎం మౌనిక, గ్రామస్తులు ఉన్నారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని ఒడ్డేపల్లి, మహమ్మద్ నగర్ గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విష జ్వరాలు, చికెన్‌గున్యాతో బాధపడుతూ మంచం పట్టిన రోగులకు వైద్య చికిత్సలు చేశారు. ఇంటింటా జ్వర పీడితుల సర్వే చేపట్టి వారికి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

కుక్కను తప్పించబోయి కారు బోల్తా

- ఐదుగురికి గాయాలు



నిజాంసాగర్(జుక్కల్): నాందేడ్- సంగారెడ్డి జాతీయ రహదారిపై నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా సమీపంలో సోమవారం కుక్కను తప్పించబోయి ప్రమాదవశాత్తు కారు బోల్తాపడింది. ఈ ఘటనలో కారు పల్టీలు కొట్టడంతో పటాన్‌చెరుకు చెందిన ఐదుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో పిట్లం ఆస్పత్రికి తరలించారు.

న్యూసెన్స్ చేస్తున్న యువకుల బైండోవర్


వివరాలు తెలుపుతున్న ఎస్సై సాయికుమార్

భిక్కనూరు: ఇద్దరు యువకులు ప్రతిరోజు రాత్రి 100కు డయల్ చేసి న్యూసెన్స్ చేయడంతో వారిని అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు భిక్కనూరు ఎస్సై సాయి కుమార్ సోమవారం తెలిపారు. వివరాలు..రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన అల్లం రాహుల్, ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ కార్మికుడు జోగేంది గోపాల్‌లు ప్రతిరోజు మద్యం సేవించి ఎలాంటి సమస్యా లేకున్నా ఉన్నట్లుగా అబద్ధం చెబుతూ కొన్ని రోజులుగా 100 నంబర్‌కు డయల్ చేస్తున్నారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా వారు ఉండకపోవడంతో పాటు సమస్య కూడా ఉన్నట్లు కనిపించలేదు. వారికి ఫోన్‌లు కూడా స్విచ్ఛ్‌డ్ ఆఫ్ వచ్చేవి. దీంతో వారిని చాకచక్యంగా పట్టుకుని స్థానిక తహసీల్దార్ శివప్రసాద్ ఎదుట బైండోవర్ చేశారు.

క్రైం కార్నర్

పోచారం ప్రాజెక్టులో దూకిన వివాహిత

- కాపాడిన యువకులు
- కుటుంబ కలహాలే కారణం


వనం నాగరాణి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంప్రాజెక్టులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివాహితను అక్కడే ఉన్న ఇద్దరు యువకుల తోపాటు పోలీసులు కాపాడారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. మెదక్ పట్టణానికి చెందిన వనం నాగరాణి(33)అనే వివాహిత కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది సోమవారం నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంప్రాజెక్టు వద్దకు చేరుకొని కట్టపై తన సెల్‌ఫోన్‌ను ఉంచి ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆ సమయంలో ప్రాజెక్టు వద్ద కొద్దిదూరంలో ఉన్న మాల్తుమ్మెద గ్రామానికి చెందిన నరేష్, అఖిల్ అనే యువకులు వెంటనే స్పందించి నీటిలో నుంచి నాగరాణిని బయటకు తీసి నాగిరెడ్డిపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో స్థానిక ఎస్సై మల్లారెడ్డి, కానిస్టేబుల్ వినోద్ హుటాహుటిన ప్రాజెక్టు వద్దకు చేరుకొని ప్రాణాపాయస్థితిలో ఉన్న నాగరాణి కడుపులో నీటిని తొలగించారు. అనంతరం ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు.



మెట్లపై నుంచి జారి పడి మహిళ మృతి

వర్ని: సైదిపూర్ గ్రామానికి చెందిన కేతావత్ పంగు(33) అనే మహిళ తన ఇంటిపై ఉన్న బట్టలు తీసుకురావడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ మెట్లపై నుంచి జారి పడి మృతి చెందినట్లు వర్ని ఎస్సై కృష్ణ కుమార్ వెల్లడించారు. ఆదివారం రాత్రి మహిళ జారిపడగా.. కుటుంబసభ్యులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కాసేపటికే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

భిక్కనూరు: బైక్‌లు దొంగతనం చేస్తున్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సోమవారం తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్నప్పుడు మల్లుపల్లి గ్రామానికి చెందిన వల్లపు గట్టు మల్లయ్య అలియాస్ మల్లేష్ అనుమానాస్పద స్థితిలో కనిపించాడని.. దీంతో విచారించగా గత జూలై 31న భిక్కనూరు చౌరస్తా నుంచి బైక్‌ను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని ఎస్సై తెలిపారు. ఆ వ్యక్తి నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని మొబైల్ కోర్టు న్యాయమూర్తి దీక్షిత్ ఎదుట ప్రవేశపెట్టగా ఆయన 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించాడని ఎస్సై వివరించారు. మల్లయ్యపై కామారెడ్డిలో చోరీ కేసులు, సిద్ధిపేటలో హత్యాయత్నం కేసులు కూడా నమోదై ఉన్నట్లు తెలిసిందన్నారు.

విద్యుత్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ నగర్‌లో చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపిన వివరాలు.. స్థానికంగా నివాసం ఉంటున్న ముత్యాల సరోజ(75)కు నలుగురు పిల్లలు. అందరికీ వివాహం అవడంతో వృత్తిరీత్యా వేరే ప్రాంతంలో స్థిరపడ్డారు. సరోజ ఒక్కరే ఇంట్లో నివసిస్తున్నారు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో తన ఇంట్లో పడుకొని ఉండగా ఒక గుర్తు తెలియని మహిళ ఇంట్లోకి వచ్చి ముఖంపై ఒక టవల్ కప్పి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లింది. ఆమె ముందు భాగం చైను పట్టుకోగా సగం తెగిన భాగం(2 తులాలు)తో ఆ మహిళ ఇంటి నుంచి పారిపోంది. ఈ విషయం గురించి బాధితురాలు ముత్యాల సరోజ నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా ఎస్‌హెచ్‌వో మహేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్ చోరీ

బాన్సువాడ రూరల్: తాడ్కోల్ శివారు పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ కాయిల్స్ చోరీకి గురైనట్లు రైతు కొల్లూర్ గంగారాం సోమవారం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 11న ఉదయం వెళ్లి పొలానికి నీరు పెడదామని బోర్ వేయగా టాన్స్‌ఫార్మర్ కిందపడి ఉండి కాపర్ కాయిల్ దొంగిలించినట్లు గుర్తించారు. చుట్టుపక్కల వెతికినా కన్పించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

నవీపేట శివారులో ఆయిల్..

నవీపేట: మండలంలోని నవీపేట-నాగేపూర్ గ్రామాల శివారులో రెండు ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి గుర్తు తెలియని దుండగులు ఆయిల్‌ను చోరీ చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం తెలిపారు. లైన్‌మాన్ కృష్ణ ఫిర్యాదు మేరకు పంచనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చోరీపై సమాచారం ఇవ్వని స్థానిక అధికారులు

భిక్కనూరు: అంతంపల్లి శివారులో ఈనెల 2న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్‌ను దొంగలు ఎత్తుకెళ్లిన విషయాన్ని స్థానిక విద్యుత్ అధికారులు, ఉన్నతాధికారులకు సమాచారమివ్వలేదని బాధిత రైతు సందుగారి జైపాల్‌రెడ్డి సోమవారం బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. కాపర్ కాయల్స్ చోరీ విషయమై ఎఫ్ఐఆర్ కాపీని భిక్కనూరు ట్రాన్స్‌కో అధికారులకు అదేరోజు ఇచ్చానని, ఇప్పటి వరకు ఈ విషయాన్ని స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదన్నారు. దీని వల్ల తనకు ట్రాన్స్‌ఫార్మర్ కొత్తది మంజూరు కాలేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తనకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయాలని ఆయన కోరారు.

ఉద్యోగం పేరిట బురిడీ

- రూ.1.38 లక్షలు స్వాహా చేసిన సైబర్ నేరస్తుడు

బాన్సువాడ రూరల్: ఓ నిరుద్యోగికి ఉద్యోగం ఇప్పిస్తానని బురిడీ కొట్టించి సైబర్ నేరగాడు రూ.1.38 లక్షలు స్వాహా చేసిన ఘటన తాడ్కోల్‌లో చోటుచేసుకుంది. సీఐ కృష్ణ తెలిపిన వివరాలు.. తాడ్కోల్‌కు చెందిన అంకం విష్ణువర్ధన్ అనే నిరుద్యోగి ఆన్‌లైన్‌లో ఉద్యోగం కోసం జూలై 29న దరఖాస్తు చేసుకున్నాడు. ఆగస్టు 7న డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు నిరుద్యోగికి సైబర్ నేరగాడు ఓ వర్క్‌లింక్‌ను పంపించాడు. దాన్ని ఈనెల 10న విష్ణువర్ధన్ పూర్తి చేసి పంపించాడు. తీరా నీ వల్ల కంపెనీకి నష్టం వాటిల్లిందని, పోలీస్ కేసు నమోదు చేయిస్తున్నట్లు, కోర్టుకు పిలిచినప్పుడు రావాలంటూ సైబర్ నేరస్తుడు బెదిరింపులకు పాల్పడ్డాడు. కేసు నుంచి తప్పించుకోవాలంటే ఉద్యోగం కోసం రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేయడంతో వారి సూచన మేరకు విడతల వారీగా రూ.1.38లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. తర్వాత తాను సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి మోసపోయినట్లు తెల్సుకుని 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. అధికారుల సూచన మేరకు బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.